క్లుప్తంగా

అచ్చమ్మతల్లి గ్రౌండ్‌ను పరిశీలించిన సీఐ



అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న పెదవేగి సీఐ శ్రీనివాస్

దెందులూరు: గాలాయగూడెం ఈ నెల 16న నిర్వహించనున్న అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల ఏర్పాట్లు, సౌకర్యాలను బుధవారం పెదవేగి సీఐ కే.శ్రీనివాస్, ఎస్సై కే.స్వామి పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులకు వాహనాల పార్కింగ్, విద్యుత్, తాగునీరు, ఇతర భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పరిశీలించారు. ఉత్సవాలు ముగిసే వరకు అమ్మవారి ఆలయ ఆవరణలో పోలీస్ పికెట్ నిర్వహిస్తామన్నారు.

క్రైస్తవుల దీక్షలు ప్రారంభం



నాగులదేవునిపాడులో ఆర్‌సీఎం చర్చిలో దీక్షాధారులతో ఫాదర్ గ్జేవియర్

దెందులూరు: క్రైస్తవ దేవాలయాల్లో బుధవారం దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షాధారులు 40 రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనతో నిరంతర ప్రార్థనలు చేయాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పీ.బాల అన్నారు. దెందులూరు, కొవ్వలిలో ఫాదర్ అమ్మన్‌రాజా, నాగులదేవునిపాడులో ఫాదర్ గ్జేవియర్, పోతునూరు, దోసపాడులో ఫాదర్ పీ.డేవిడ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు దీక్షలు ప్రారంభించారు. ఫాదర్లు దీక్షలు ప్రారంభించిన క్రైస్తవులకు మెడలో జపమాల వేసి, నుదుటన విభూది పెట్టారు. దెందులూరు సాల్వేషన్ ఆర్మీ చర్చిలో కోర్ ఆఫీసర్ రమణయ్య, కొవ్వలిలో కోర్ ఆఫీసర్ సుబ్బారావు, ఆధ్వర్యంలో సాల్వేషన్ ఆర్మీ చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

వాలీబాల్ పోటీలు

దెందులూరు: రామారావుగూడెంలో కాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో కాలి నాని జ్ఞాపకార్థం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రామారావుగూడెం నుంచి రెండు టీమ్‌లు, శ్రీరామవరం ఒక టీమ్, చల్లచింతలపూడి ఒక టీమ్, మేధినరావుపాలెం ఒక టీమ్, ఖండ్రిక నర్సింహారావుపురం టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు రామారావుగూడెం రెండు టీమ్‌లు వచ్చాయి. విజేతగా రామారావుగూడెం-1 టీమ్ నిలిచింది. విజేత టీమ్‌కు కానిస్టేబుల్ కాలి రమేష్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, ఉపాధ్యాయులు కాలి రామారావు బహుమతులు అందజేశారు. కానిస్టేబుల్ కాలి రమేష్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి సర్వే ఉద్యోగుల సమస్యలు

దెందులూరు: డివిజనల్ ల్యాండ్ సర్వే అధికారుల సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ హామీ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డివిజనల్ సర్వే అధికారుల అధ్యక్షులు సొంగా రవీంద్రప్రసాద్ అన్నారు. దెందులూరు మండలం గంగన్నగూడెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డివిజనల్ సర్వే అధికారుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి వివరించినట్టుతెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై కైకరం వద్ద తాడేపల్లిగూడెం వైపు వెళ్లే వ్యాను ఆ దారిలో నడిచి వెళుతున్న కొడపాటి ప్రకాష్‌ను బుధవారం రాత్రి ఢీకొంది. ప్రకాష్‌ని ఢీకొని వెళ్లిపోతున్న వ్యానును వెంబడించిన గ్రామస్తులు నారాయణపురం వద్ద డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ప్రకాష్ తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో తొలుత తాడేపల్లిగూడెం అక్కడినుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై మణికుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

భీమడోలు: పోలసానిపల్లి గీతాంజలి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలకు విశేష స్పందన లభించింది. భీమడోలు సమీపంలోని అంతర్జాతీయ సంస్థ లిక్సిల్ కంపెనీలో ఏర్పడిన ఖాళీ పోస్టుల్లో అర్హత గల ఎంపిక చేసేందుకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల శిబిరాన్ని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సి.మధుభూషణరావు ప్రారంభించారు. కంపెనీ ప్రతినిధులు మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. 350 ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. డీఈవో సి.మధుభూషణరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ కల్పనకు ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. గీతాంజలి కళాశాల కరస్పాండెంటెంట్ ఎం.గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ నైపుణ్యత కలిగి వారికి అధిర వేతనాలు అందిస్తారని,దీంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తాయన్నారు. అనంతరం పలువురిని ఎంపిక చేసుకున్నారు. ప్రిన్సిపల్ ఆర్.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ ఎం.ఉదయ్‌కిరణ్, జిల్లా కెరీర్ కోఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కృష్ణ, లిక్సిల్ కంపెనీ హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్ లీడర్ ఎన్.రామ్మోహన్, హెచ్‌ఆర్ లీడర్ కె.లోకేష్, వెంకటేశ్వరరావు, కిషోర్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

- దెందులూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు కృషి
- 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలి
- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తాళ్లమూడిలో గ్రామ సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, చిత్రంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



తాళ్లమూడిలో మంత్రి కారుమూరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారును గజమాలతో సత్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

పెదపాడు: సీఎం జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, టీడీపీ ప్రభుత్వంలో పచ్చచొక్కా వేసుకున్నవారికే మేలు జరిగిందని ఈ విషయాన్ని ప్రజలకు గమనించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని తాళ్లమూడిలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ పంచాయతీ భవనం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, పాలసేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన్ను గజమాలతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సత్కరించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అబ్బయ్యచౌదరి ఉన్నత విద్యావంతుడని, సంస్కారం కలవాడని అన్నారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, అన్ని వర్గాలను కలుపుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కొఠారు కృషి చేస్తున్నట్టు మంత్రి కారుమూరి కొనియాడారు. అయన్ను చూసి గర్వపడుతున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేనికి నీతి నిజాయతీలు లేవని, ఎస్సీలను కించపరిచిన దుర్మార్గుడని దయ్యబట్టారు. చంద్రబాబు కూడా అధికారుల సమావేశాల్లో టీడీపీ వారికే మేలు చేయండని బహిరంగంగా ఆదేశాలిచ్చేవారని విమర్శించారు. చంద్రబాబు పాలనా కాలమంతా దోచుకో, దాచుకో అన్న చందంగా గడిచిందని అన్నారు. మీ బిడ్డ జగనన్న ప్రజలకు, కార్యకర్తలకు గౌరవాన్ని తీసుకువచ్చారని గుర్తు చేసారు. ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మీకు మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వేయండని ప్రజలను అడగగల దమ్మున్న నాయకుడు మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేసారు. అప్పనవీడులో రూ.66.34 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. గత పాలకులు చేసిందేమీ లేదని అన్నారు. ప్రజలకు ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు వివరించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుకు గతంలో రూ.5లక్షలు పరిమితి ఉండేదని నేడు రూ.25లక్షల పరిమితి పెంచారని అన్నారు. పిల్లల చదువులకు బ్యాగులు పుస్తకాలు, టైలు షూలు, గోరుముద్ద పథకంలో నాణ్యమైన పోషకాలు కలిగిన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. దివంగత సీఎం వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంద్వారా ఎందరో పేద విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. ప్రజల క్షేమం కోరే సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలిచి వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఘన విజయాలు అందించాలని మంత్రి కారుమూరి కోరారు.

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

పాదయాత్ర చేస్తూ ప్రజల కోసం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఎంతో కష్టపడుతున్నారని, ఎంతో అభివృద్ధి చేసాడని మంత్రి కారుమూరి అన్నారు. ఎంపీ అభ్యర్థిగా మా అబ్బాయిని మీ వద్దకు పంపుతున్నానని ఆయన్ను కూడా ఆశీర్వదించాలని ఆయన కోరారు. బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్ నెరవేర్చారని అన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ప్రజల ఇంటికే పథకాలన్నీ అందిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఓటు వేసి వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ బుధవారం తాళ్లమూడి వద్ద నాలుగు నూతన ప్రభుత్వ భవనాలు ప్రారంభించామన్నారు. రూ.2కోట్లు వెచ్చించి డ్రెయినేజీలు, రూ.2కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. రూ.3.60 కోట్ల వ్యయంతో 355 మందికి ఇళ్ల స్థలాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకులకు ప్రస్తుత పాలకులకు గల వ్యత్యాసాన్ని తెలుసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఆళ్ల సతీష్‌చౌదరి, సీనియర్ నాయకులు ఊదర గొండి చంద్రమౌళి, వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ ఏసుపాదం, ఎంపీటీసీ బుద్దే రామసీత, కడిమి గోవిందరావు, తోట పద్మారావు, కొత్తూరు విమలారావు, విశ్రాంత ఎంఈఓ మారుబోయిన కోటేశ్వరరావు, బత్తుల ఏసురాజు, వివిధ గ్రామాల నాయకులు, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌కే సాధ్యం

- సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సవాల్
- అప్పనవీడులో ప్రజా ఆశీర్వాద యాత్ర



అప్పనవీడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: సామాజిక న్యాయం, సమ సమాజ స్థాపన, అన్ని వర్గాలకు మేలు చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చెప్పారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో ప్రజా ఆశీర్వాదయాత్ర బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

తాళ్లమూడిలో జీజీఎంపీ రూ.20లక్షలతో నిర్మించిన డ్రెయినేజీలను, నాడు-నేడు పథకం ఫేజ్-1లో రూ.44 లక్షల నిధులతో జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి, నాడు-నేడు ఫేజ్-2లో రూ.16 లక్షలతో తాళ్లమూడి ఎలిమెంటరీ పాఠశాల అభివృద్ధి, రూ.3లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులతో 8.66 ఎకరాలు భూ సేకరణకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు రూ.32 లక్షలతో గ్రావెల్ రోడ్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.80 లక్షలతో సీసీ రోడ్లు, జీజీఎంపీ అప్పనవీడు-1లో రూ.20లక్షలతో సీసీ డ్రెయిన్లు, రూ.17లక్షలతో నాడు-నేడు పనులు, ఫేజ్-2లో మరో రూ. 5లక్షలతో ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల అభివృద్ధి, రూ.1.20 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.22 లక్షలతో జగనన్న లే అవుట్ లెవెలింగ్, అంతర్గత రహదారులు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎంపీ లాడ్స్‌లో రూ.8 లక్షలతో అప్పనవీడు శ్మశానం అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, రూ.43.60 లక్షలతో తాళ్ల మూడి సచివాలయం, 23.5 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం, రూ.18.04 లక్షలతో పాలసేకరణ కేంద్రం నిర్మాణం, రూ.20.80 లక్షలు వైఎస్సార్ హెల్త్ క్లినింగ్, రూ. 43.6 లక్షలతో అప్పనవీడు -1 సచివాలయం నిర్మాణం, రూ.23.5 లక్షలతో ఆర్‌బీకే నిర్మాణం, రూ.18.04 లక్షలతో పాలసేకరణ కేంద్రం నిర్మాణం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినింగ్, రూ. 40లక్షలు నిధులతో ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే కొఠారు ప్రారంభించారు. జగనన్న హౌసింగ్ కాలనీలో రూ.14.03 లక్షలతో వేసిన బోరువెల్, పైపులైన్ పనులు, రూ.7లక్షలతో జగనన్న కాలనీ అప్రోచ్ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.05 కోట్ల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు.

ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతిపక్షాలు పాదయాత్ర చేస్తూ ప్రజలను మభ్య పెట్టే పనిలో ఉన్నారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 5 ఏళ్లలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు ఆయన సవాల్ చేశారు. అప్పనవీడులో ఒక్క సెంటు స్థలమైనా వీరు ఇచ్చారా అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. హనుమాన్ జంక్షన్ సెంటరులో రూ.66.34 కోట్లతో చేసిన అభివృద్ధిపై ఫ్లెక్సీ కడతామని అన్నారు. ప్రజలకు సక్రమంగా పథకాలు అందాలన్నా, గ్రామాలు ప్రగతి పథంలో పయనించాలన్నా ముఖ్యమంత్రిగా జగనన్నే రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైస్ ఎంపీపీలు అప్పన పద్మావతి, రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక సర్పంచ్ చిన్నాల ఝాన్సీ ఏసుపాదం, ఎంపీటీసీ బుద్దే రామసీత, కడిమి గోవిందరావు, తోట పద్మారావు, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి



భీమడోలులో వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త ఫణికుమార్, టి.సుజాత తదితరులు

భీమడోలు: వాతావరణంలోని మార్పుల వల్ల దాళ్వా చేలకు దుబ్బు తెగులు సోకుతుందని, రైతులు సస్య రక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడుల సాధించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ కోరారు. భీమడోలులో బుధవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మేలైన యాజమాన్య పద్ధతులపై పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఏవో ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి డాట్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ టి.సుజాత, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఫణికుమార్ పరిసరాల పర్యావరణ విశ్లేషణలో భాగంగా దాళ్వా వరి చేలను పరిశీలించారు. పొలం గట్ల వెంబడి పాడ తెగులు ఉందని గుర్తించారు. గట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గట్లపై కలుపు మొక్కలు లేకుండా చూడాలని రైతులకు సూచించారు. ప్రస్తుత వాతావరణంలో దోమల ప్రబలే అవకాశాలున్నందున వాటి నివారణకు రైతులకు పలు సస్య రక్షణ చర్యలు పెట్టాలన్నారు. దుబ్బు తెగులు నివారణకు తగు చర్యలు చేపట్టాలని, రైతులకు సూచనలందించారు. ప్రోఫికోనజోల్‌ను లీటర్ నీటిలో ఒక మిల్లీలీటర్ లేదా టెబూకోనజోల్ ఒక లీటర్ నీటిలో రెండు ఎంఎల్‌ను పిచికారీ చేసి 15 రోజులకొకమారు పిలకలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఆకు ముడత తెగులు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఒక ఎకరాకు 8 కేజీల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఏవో ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ ఈనెల 16న మండలంలో సామూహిక ఎలుకల నివారణ మందును పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉప్పాకపాడులో 'గడపగడపకు'

ఉంగుటూరు: మండలంలెపి ఉప్పాకపాడు గ్రామంలో గురు, శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పాఠశాలల్లో ఘనంగా వసంత పంచమి



అన్నేవారిగూడెంలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు



జల్లికొమ్మర యూపీ స్కూల్లో సరస్వతీ పూజల్లో పాల్గొన్న చిన్నారులు

భీమడోలు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. దుద్దేపూడి పంచాయతీ శివారు అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో వసంత పంచమిని పురస్కరించుకుని సరస్వతీ దేవి పూజలు చేసారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటూ ఐదేళ్లు నిండిన ప్రీస్కూలు బాలబాలికలతో అక్షరాభ్యాసం చేయించారు. తొలుత పాఠశాలలో పేరెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. చిన్నారులకు కొత్త పలకలు, బలపాలతో ఓం అనే అక్షరాన్ని రాయించారు. బియ్యంపై తెలుగు సంప్రదాయ పద్ధతిలో అక్షరాభ్యాసం చేయించారు. తొలుత సరస్వతీ పూజలు చేసారు. హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వం సర్కారీ బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రూపురేఖలు మార్చిందన్నారు. తద్వారా ప్రైవేటు స్కూలుకు వెళ్లే విద్యార్థులు సైతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారన్నారు. బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రవిభారతి, ఝాన్సీ, ఎం.స్వర్ణలత, ఎం.విజయకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.మౌనిక, పెద్దలు అన్నేం నాగ సుశీలరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా వసంత పంచమి పూజలు

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో బుధవారం చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మదినం పుస్కరించుకుని వసంత పంచమి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. దీనితో పాటు సర్వస్వతీ దేవి ఆశీస్సులు కోరుతూ పూలమాలలతో విద్యార్థులు పూజలు చేసారు. గణపవరం లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కొండపల్లి రాము విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలతోపాటు విద్యాసామగ్రి పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుందర కుమార్, టీచర్స్ పి. సౌజన్య, ఎల్ ప్రసాదరావు, శ్రీదేవి, పార్వతి, లీలాగోపాల్, సరస్వతీ, రమేష్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ ఆసరాతో మహిళల జీవితాల్లో వెలుగు



పిప్పరలో సీఎం జగన్‌కు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

గణపవరం: వైఎస్సార్ ఆసరా కార్యక్రమం మహిళల జీవితాల్లో వెలుగులు నింపిందని, అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గణపవరం మండలం పిప్పరలో మండలంలోని 18 గ్రామాల్లోని డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకంలో అందించిన ఆర్థిక సహాయం చెక్కులను డ్వాక్రా సంఘాల గ్రూపులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మహిళా సాధికారతను ఆచరణలో చేసి చూపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మహిళలందరూ అండగా ఉండాలన్నారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలను ఆదుకుని రాష్ట్రాన్ని సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్ది ప్రజాభిమానాన్ని పొందుతున్న ముఖ్యమంత్రి జగన్‌పై పచ్చమీడియా అదే పనిగా దుష్ప్రచారం చేస్తోందని దీనిని ప్రజలంతా గమనిస్తున్నారని అన్నారు. మహిళా శక్తి అండగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఎటువంటి దుష్టశక్తులు ఏమీ చేయలేవని అన్నారు. వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని అన్నారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి మరిన్ని పథకాలను అమలుచేసి ముందుకు నడిపిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి డ్వాక్రా మహిళకు రుణ మాఫీ, సున్నా వడ్డీ పథకాల ద్వారా కనీసం లక్ష రూపాలయ వరకూ లబ్ధి చేకూర్చామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పిప్పర, కేశవరం, ముప్పర్తిపాడు, డికెవల్లి, మొయ్యేరు, కోమర్రు, వెంకట్రాజపురం, కోమట్లపాలెం, చిలకంపాడు, కాశిపాడు, వీరేశ్వరపురం, వాకపల్లి, వల్లూరు, ముగ్గుళ్ల, ఏ.గోపవరం, అప్పనపేట, జల్లికాకినాడ, ఎస్.కొందేపాడు గ్రామాలకు చెందిన డ్వాక్రా గ్రూపులకు రూ. 5,15,77,988 విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాకర బేబీ, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ నీతిపూడి వీరమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు రాము, నాయకులు కాకర శ్యాంసన్, ఐఎస్‌రాజు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన బీజేపీ ప్రభుత్వం



కైకరంలో రైతులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు

ఉంగుటూరు: మోదీ ప్రభుత్వం రైతులను మోసగించిందని దీనికి నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త కార్మిక కర్షక సమ్మెలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు తెలిపారు. భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో ఆయన పర్యటించారు. స్థానిక రైస్‌మిల్లు వద్ద కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. కైకరంలో రైతులతో కలిసి కరపత్రాలు పంచారు.మోదీ ప్రభుత్వం కార్మికలను రైతులను మోసంచేసి నట్టేట ముంచిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టే నిర్ణయాలు చేయడంవల్ల దేశంలో ధరలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిందని చెప్పారు. 16న దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని కార్యక్రమంలో కార్మికులు కర్షకలు, ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొనాలని తెలిపారు.

ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి శ్రీకారం

దెందులూరు: జోగన్నపాలెంలో బుధవారం ప్రసిద్ధిగాంచిన బాలత్రిపుర సుందరీదేవి సమేత యోగలింగేశ్వరస్వామి పంచాయతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఈ నెల 28న ఉదయం 10.02 గంటలకు బ్రహ్మశ్రీ బాదంపూడి ఫణిశర్మ, కొత్తలంక రామ్‌ప్రసాద్‌శర్మ, రుద్రపాటి చైతన్య సాయి, సాయిదత్త పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఆలూరి వీరనాగగోవిందరావు, సావిత్రిదేవి అన్నారు. బుధవారం ఉదయం 10.52 గంటలకు ఆలయ ఆవరణలో పునఃప్రతిష్ఠ పూజల్లో భాగంగా రాట కార్యక్రమంతో శ్రీకారం చుట్టారు. తొలుత ఆలయ దుర్గ చండేశ్వర, కాలభైరవ ద్వారపాలక, జంట నాగుల పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.